## క్లుప్తంగా

### ధాన్యం డబ్బులు ఇప్పించాలి

నల్లగొండ టౌన్ : గుర్రంపోడు మండలం తేర టిపల్లి సహకార సంఘంలో ధాన్యం అమ్మిన రైతులకు నేటికీ డబ్బులను ఖాతాల్లో జమచేయలేదని, వెంటనే ధాన్యం డబ్బులను ఖాతాల్లో జమచేయించాలని కోరుతూ మంగళవారం డీఎస్ఓ వెంకటేశ్వర్లుకు రైతు సంఘం నాయకుడు జక్కుల నర్సింహతో పాటు పలువురు రైతులు నల్లగొండలో వినతిపత్రం అందజేశారు. క్వింటాలుకు పది కిలోల తరుగు తీస్తామని అంటున్నారని, తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆలయానికి విరాళం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో స్టోర్ రూం నిర్మాణానికి హైదరాబాద్‌లోని బాలాపూర్‌కు చెందిన వెల్లుర్తి వినోద్‌కుమార్–ఉమా రూ.50,016 విరాళం అందజేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పెందోట సోము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మచారి, వైస్ చైర్మన్ గుంటోజు రమేష్, శ్రీనివాసచారి, సత్యనారాయణ, అర్చకుడు ఉత్తరపెల్లి అనంతచారి పాల్గొన్నారు.

### పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, హైస్కూల్‌లను ఆయన సందర్శించి మాట్లాడారు.

### 22న ప్రత్యేక సమావేశం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశం ఈ నెల 22న మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

### ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదానం

నల్లగొండ టౌన్ : ఎస్‌బీఐ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రీజినల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీజీఎం ప్రశాంత్‌కుమార్, ఏజీఎస్ సుమన్, నర్సింహ, ప్రవీణ్, శ్రీధర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

### యోగా దినోత్సవానికి తరలిరావాలి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

### గడువు పొడిగించాలని వినతి

చిట్యాల : బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలని కోరుతూ చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు అవిశెట్టి శంకరయ్య మంగళవారం చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. రుద్రారపు పెద్దులు, ఐతరాజు నర్సింహ, నాగయ్య, రూపని శ్రీను, రూపని లక్ష్మణ్, అర్జున్, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీకి భవనం కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ భవనం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఆ భవనంలో కొన్నాళ్లు ఉర్దూ మీడియం పాఠశాల నడిపించారు. ఆ పాఠశాల విద్యార్థులు లేకపోవడంతో మూతపడింది. దీంతో భవనం ఆవరణలో కంప చెట్లు పెరిగాయి. అదేవిధంగా దీనిపై ఈ నెల 19వ తేదీన సాక్షి దినపత్రికలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ యాదగిరి ఆ భవనాన్ని అంగన్‌వాడీ–1 కేంద్రానికి కేటాయించాలని నార్కట్‌పల్లి సర్పంచ్ దూదిమెట్ల స్రవంతివెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శుభనోద్దిన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

### 'ఐకాన్'లో అరుదైన చికిత్స

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ఐకాన్ మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా కెరోటిడ్ ఎండార్టెక్టమి సర్జరీని విజయవంతంగా నిర్వహించామని వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ బొల్లినేని తెలిపారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళమైన కెరోటిడ్ ధమనులకు సంబంధించిన నిర్దిష్ట పరిస్థితులను తగ్గించడానికి నిర్వహించే అత్యాధునిక వైద్య ప్రక్రియ ఈ సర్జరీ అన్నారు. ఈ సర్జరీ ద్వారా మెడ రక్తనాళంలోని రక్తం గడ్డలను తొలగించి సాధారణ రక్తప్రసారాన్ని పునరుద్ధరించడం వల్ల ప్రాణాలను కాపాడగలిగామన్నారు. రెండు రోజుల క్రితం అంజయ్య, రాములు అనే వ్యక్తులకు ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ శశాంక కోడె, న్యూరోఫిజీషియన్ సాయి మౌనిక చెరుకూరి, కార్డియాలజిస్టు రవిశంకర్ కన్నా, క్రిటికల్ కేర్ లావణ్య కడిమి, గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ శశీంద్రల బృందం సహకారంతో సర్జరీలను విజయవంతంగా చేశామన్నారు.

# బీఆర్ఎస్‌తోనే పేదలకు మెరుగైన విద్య

- నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో ఘనంగా విద్యా దినోత్సవం



మునుగోడు : కొంపల్లిలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



శాలిగౌరారం : విద్యా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్ చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

మునుగోడు : రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన విద్య నేడు అందుతుందంటే కేవలం బీఆర్ఎస్ పాలనతోనే సాధ్యమైందని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా కొంపల్లి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి రూ.50 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఎంపీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు రాగి జావ, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, నారబోయిన రవి, సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, దోకూరి శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం యాదగిరి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి**

విద్యారంగ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.కళ్యాణచక్రవర్తి, సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఎంపీటీసీ బొడ్డు శ్రావణి నాగరాజుగౌడ్, హెచ్ఎం యాదయ్య పాల్గొన్నారు.

**మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం**

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మండలంలోని వట్టిమర్తి గ్రామంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో నిర్మించిన గ్రంథాలయ గదిని మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, రాగిజావ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పర్నే నరేందర్‌రెడ్డి, ఎంఈఓ కుకుట్ల నర్సింహ, ఎంపీఓ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాఠశాలల్లో విద్యా దినోత్సవం**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిట్యాల, ఉరుమడ్ల, తాళ్లవెల్లెంల, నేరడ, పెద్దకాపర్తి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని హెచ్‌ఎంలు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా తాళ్లవెల్లెంల పాఠశాలకు స్థల దాత పజ్జూరి అజయ్‌కుమార్‌రెడ్డిని, గతంలో పాఠశాల అభివృద్ధికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించిన కుకునూరు దేవిరెడ్డిని, సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మిపతి, ఎస్ఎంసీ చైర్మన్ జోగు లావణ్య లింగస్వామిని ఉపాధ్యాయులు సన్మానించారు. చిట్యాల పీఎస్‌లో దంతూరి శ్రీనివాస్‌శర్మ నాలుగు వేల రూపాయల విలువ గల కథల పుస్తకాలు అందజేశారు. ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు మాదగాని శంకరయ్య బుద్ధ భగవాన్ సాయి శివశంకర మారుతి ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2022–23లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రూపని తేజస్వినికి రూ.5116 అందజేశారు. నేరడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ మర్ల అలివేలు రాంరెడ్డి పుస్తకాలు అందజేశారు. చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పుస్తకాలు అందజేశారు. సర్పంచ్‌లు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి జలంధర్ రెడ్డి, హెచ్ఎం గోలి స్లీవమ్మ, దేవపాల, మాధవి, రామలింగాచారి, ఎస్ఎంసీ చైర్మన్ పోలెపల్లి సత్యనారాయణ, గోలి భాస్కర్, ఆవుల మంజుల జానయ్య, వైస్ చైర్మన్ నరేష్ పాల్గొన్నారు.



చిట్యాల : వట్టిమర్తి పాఠశాలలో గ్రంథాలయ గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి



కట్టంగూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నార్కట్‌పల్లి : జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ

కనగల్ : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా కనగల్, రేగట్టే, ఉన్నత, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్, కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్, మహ్మద్ ఆలీ, ఎర్రోళ్ల సంజీవ, మామిడాల శివ, గోవర్ధన్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ తరాల బలరాములు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి**

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో ఆయన జెండా ఎగురవేసి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, ఎంపీటీసీ దుబ్బాక పావని శ్రీధర్, వార్డు సభ్యులు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, మహేష్, వెంకట్‌రెడ్డి, మల్లేషం, శేఖర్‌రెడ్డి, నర్సింహ, నరేష్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**తిప్పర్తిలో..**

రామగిరి(నల్లగొండ) : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిప్పర్తి మండలంలోని అన్ని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, సర్పంచ్ రమేష్, జాకటి మోషె, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన**

మర్రిగూడ : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కొనసాగుతోందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లెంకలపల్లి పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.32.78లక్షల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, రాగిజావను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేవిధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జగదీశ్వర్, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ గురువారావు, ఏఈలు యశ్వంత్, వెంకటేశ్వర్లు, సర్పంచ్ నగేష్‌యాదవ్, ఏపీఎం హరి, దామెరభీమనపల్లి ఎంపీటీసీ విష్ణు, ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిరేకల్ : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వంటల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ షేక్ యాస్మిన్ నయీం, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, నర్సయ్య, సుష్మ, యాదమ్మ ఉన్నారు.

**విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది**

శాలిగౌరారం : విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. రూ. 3.02 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పావురాలగూడెం–చొల్లగూడెం ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు రెన్యూవల్ పనులను పావురాలగూడెంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో రూ.90 లక్షలతో నిర్మించనున్న పీఏసీఎస్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన విద్యా దినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రూ.2.22 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తక్కెళ్లపాడ్–మనిమద్దె ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు రెన్యూవల్ పనులను తక్కెళ్లపహాడ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన విద్యాదినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యా దినోత్సవంలో మండల కేంద్రానికి చెందిన కేజీబీవీ విద్యార్థినులు చేసిన నృత్యాలకు ఎమ్మెల్యే సంతోషాన్ని వ్యక్తం చేసి ప్రోత్సాహకంగా రూ.20 వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఎర్ర రణీల, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, స్థానిక సర్పంచ్ బట్ట హరిత, ఎంపీటీసీ జోగు సైదమ్మ, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న పాల్గొన్నారు.

**విద్య, ఉపాధిపై దృష్టి సారించాలి**

నల్లగొండ రూరల్ : ప్రభుత్వం విద్య, ఉపాధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం యూనివర్సిటీలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవి, అన్నపూర్ణ, కొప్పుల అంజి రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

**విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**

కేతేపల్లి : విద్య, వైద్య రంగాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా మండలంలోని గుడివాడ గ్రామంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న హెల్త్ సబ్‌సెంటర్ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచ్ కట్ట శ్రవణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ : దశాబ్ది వేడుకల్లో భాగంగా జీవీగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రినిపాల్ పి.లలితకుమారిని ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ ఏ.నరసింహ, జనరల్ సెక్రెటరీ బి.పాండు, సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకన్న అధ్యాపకులు పాల్గొన్నారు.



నకిరేకల్ : పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో..



కనగల్ : నోటుపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ



తిప్పర్తిలో ర్యాలీలో పాల్గొన్న పాశం రాంరెడ్డి



నల్లగొండ : ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న పేరెంట్స్ కమిటీ

### ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కంచర్ల

రామగిరి (నల్లగొండ) : పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జరగనున్నట్లు ఆధ్యాత్మిక దినోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, మున్సిపాలిటీ ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### కూరగాయల సంత స్థల వివాదం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని మసీదు ఎదురుగా ఉన్న స్థలంలో (గ్రామ కంఠం) కొన్నేళ్లుగా కూరగాయల సంత కొనసాగుతోంది. అయితే ఆ స్థలానికి సంబంధించి వివాదం కొనసాగుతుంది. మంగళవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్, ఎస్ఐ సైదాబాబు సమక్షంలో ఇరువర్గాలను కూర్చోబెట్టి పూర్తి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్థల సమస్యను కలెక్టర్, ఎస్పీ స్థాయిలో పరిష్కారం చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇరువర్గాల వద్ద ఉన్న డాక్యుమెంట్లను సమర్పించినట్లయితే పరిశీలించి కలెక్టర్‌కు, ఎస్పీకి నివేదిక అందజేస్తామని తెలిపారు.

### 26న బీజేపీ సభ

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలో మోదీ ప్రభుత్వం 9 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 26న సాయంత్రం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిట్యాల : నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆరు వేల కోట్ల నిధులను కేటాయించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. చిట్యాలలో మంగళవారం జరిగిన నాయీబ్రాహ్మణ కుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరోజు వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాపురం రాము, అమరోజు శ్రీరాములు, కృష్ణయ్య, వెంకన్న, సత్తయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : మండల పరిధిలోని శేరి లింగోటం గ్రామ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను లింగోటం స్టేజీ వద్ద పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్ఐ నర్రా అంతిరెడ్డి మంగళవారం తెలిపారు. పోలీసులను చూసి ట్రాక్టర్ డ్రైవర్ పారిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### కౌలు భూములకు వేలం

కనగల్ : మండలంలోని ఎం గౌరారం పరిధిలో గల హాలియా మండలం మారెపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన భూములకు మంగళవారం కనగల్ రైతు వేదికలో కౌలు వేలం పాట నిర్వహించారు. 189 ఎకరాలకు సంబంధించి 70 ప్లాట్లకు 58 ప్లాట్ల ద్వారా రూ.9,18,500 ఆదాయం వచ్చిందని ఈఓ అంబటి నాగిరెడ్డి తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కూసం ఉపేందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మట్టపల్లి వెంకన్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

### చెరువు మట్టి పూడ్చేందుకు రైతు అంగీకారం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని పజ్జూరు శివారులో గల గార్ల చెరువులో ఈ నెల 15వ తేదీన సూరారం గ్రామానికి చెందిన పెండెం పాండయ్య అక్రమంగా మట్టిని తరలించాడు. దీంతో స్థానిక రైతులు, సొసైటీ సభ్యులు ఇరిగేషన్ ఈఈ సురేందర్‌రావుకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు తిప్పర్తి ఏఈఈ శివరామ్‌ప్రసాద్ సోమవారం చెరువును పరిశీలించారు. పెండెం పాండయ్య మంగళవారం నల్లగొండలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ సురేందర్‌రావును కలిశారు. తనతోపాటు మరో ఐదుగురు వ్యక్తులు చెరువు మట్టిని తవ్వారని, జూన్ 26వ తేదీలోగా ఎఫ్‌టీఎల్ వరకు మట్టిని పూడుస్తామని రాసిచ్చాడు.

### ఎస్సీ వర్గీకరణ సాధనకు ఉద్యమించాలి

కేతేపల్లి : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగలు మరో ఐక్యంగా ఉద్యమించాలని కావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు గోవింద్ నరేష్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా జూలై నెలలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ సన్నాహక సభను మండలంలోని ఇనుపాముల గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు రాజకీయాలకతీతంగా మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందిరి రమేష్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్, ప్రసాద్, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత

నకిరేకల్ : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన నకిరేకల్ 108 అంబులెన్స్ పైలెట్ అబ్దుల్ హుస్సేన్ కుటుంబానికి 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కంపెనీ ఆధ్వర్యంలో మంజూరైన రూ.5 లక్షల చెక్కును మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ అబ్దుల్ రహీమ్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంయుక్త మోర్చాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బుధవారం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొన్నాలన్నారు. ఈ నెల 22న బూత్‌స్థాయిలో ప్రతిఇంటికీ తిరిగి ప్రజలకు కేంద్ర పథకాలను వివరించాలన్నారు. 23 నుంచి 30 వరకు ఇంటింటికీ కరపత్రాలు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ బండారపు లింగస్వామి, అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి కారంపూడి సాయికుమార్, మాదూరి ప్రభాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య, పజ్జూరి వెంకట్‌రెడ్డి, కోమటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో వారం రోజులుగా మంచినీళ్లు రావడం లేదని ఆ గ్రామ మహిళలు మంగళవారం కనగల్–చండూరు ప్రధాన రహదారిపై జి యడవల్లి గ్రామంలో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. అటు వైపు వస్తున్న సర్పంచ్ పులకరం యాదమ్మమారయ్యను మహిళలు నిలదీశారు. దూర ప్రాంతాలతో పాటు వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని మహిళలు పేర్కొన్నారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి ఖాసీంను వివరణ కోరగా రాత్రివేళ విద్యుత్ కోతలతో ట్యాంకులకు నీళ్లు సరిపడా ఎక్కడం లేదని తెలిపారు.

### ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద ఓ హోటల్ రేకులు ఎగిరి వ్యవసాయం పొలంలో పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతోపాటు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

**మునుగోడులో మోస్తరు వర్షం**

మునుగోడు : మండలంలోని చల్మెడ, కల్వకుంట్ల, కొంపల్లి, పలివెల, చీకటిమామిడి, కోతులారం గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో చినుకు రాలకపోవడంతో ఆయా గ్రామాల్లోని రైతన్నలు నిరాశకు లోనవుతున్నారు.

**శాలిగౌరారంలో భారీ వర్షం**

శాలిగౌరారం : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి శాలిగౌరారంలో వేపచెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అదేవిధంగా తిరుమలరాయునిగూడెం గ్రామంలో పెండెల బుచ్చయ్యకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

## కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు విశ్వనాథుల లెనిన్, పి.ఎల్లమ్మ, ఆర్.భాగ్యమ్మ, ఊషమ్మ, సబిత, దేవేందర్, పద్మ, వెంకటమ్మ, మంగమ్మ, మల్లిక, యాదమ్మ, ఇందిరా, జయమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాలు అందజేత

మర్రిగూడ : కొండూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.25వేల విలువగల నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లను దాతలు బండి జహంగీర్, బండి శేఖర్ మంగళవారం అందజేశారు. అనంతరం యూనిఫాం, పాఠ్య పుస్తకాలను సర్పంచ్ కుంభం నర్సమ్మమాధవరెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు.

### విద్యుదాఘాతానికి ఎద్దు మృతి

శాలిగౌరారం : విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన ఆకారం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన కారింగుల సైదులు రోజువారీగా తన అరక ఎడ్లను మేపేందుకు వ్యవసాయ పొలం వద్దకు తోలుకుపోయాడు. ఈక్రమంలో ఒక ఎద్దు మేతమేసుకుంటూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతిచెందింది.

### ముగిసిన స్థల వివాదం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (సత్రం బడి) ముందు, మసీద్ వెనుకల ఉన్న భూమిపై స్పష్టత లేకపోవడంలో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ ఖాళీ స్థలంలో స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఖాళీ స్థలం పక్కన నిరుపయోగంగా ప్రభుత్వ భవనం ఉంది. ఆ భవనం మసీద్‌కు చెందినదని మసీద్ కమిటీ సభ్యులు, గ్రామానికి సంబంధించినదని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇరు వర్గాలు స్థానిక ఎస్ఐని సంప్రదించారు. దీంతో స్థానిక తహసీల్దార్‌కు ఎస్ఐ లేఖ రాయడంతో తహసీల్దార్ సైదులు సర్వేయర్‌తో ఆ స్థలాన్ని సర్వే చేయించారు. గ్రామ నక్ష ప్రకారం 14 గుంటల భూమి నార్కట్‌పల్లి గ్రామ కంఠంకు చెందినదిగా గుర్తించి నివేదిక తమకు అందజేసినట్లు ఎస్ఐ సైదాబాబు పేర్కొన్నారు.

### మార్కెట్‌లోకి కొత్త కారు విడుదల



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : పట్టణంలోని పవన్ నెక్సా షోరూంలో మారుతి సుజికి జిమ్నీ కారును భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఎండీ చంద్రపవన్ రెడ్డితో కలిసి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కోమటి రెడ్డి మాట్లాడుతూ నూతన వాహనాలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని చంద్రపవన్ రెడ్డిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెక్సా షోరూం మేనేజర్ రిషికేష్ రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.